
మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు : సీపీ శ్వేత

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** సిద్దిపేట పట్టణ శివారులోని పొన్నాల ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 3న అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున కౌంటింగ్ కేంద్రంతో పాటు జిల్లాలోని గ్రామాల్లో, పట్టణాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, కౌంటింగ్ సజావుగా నిర్వహించేందుకు 3న ఉదయం 6 గంటల నుంచి 4న ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు సీపీ శ్వేత తెలిపారు. శుక్రవారం అమె మాట్లాడుతూ నలుగురు కానీ అంతకంటే ఎక్కువ మంది కానీ గుంపులు, గుంపులుగా తిరగొద్దన్నారు. పార్టీ జెండాలు, పార్టీ కండువాలు, గుర్తులు, ప్లకార్డు ప్రదర్శించొద్దన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దన్నారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల ప్రవర్తన నియమావళిని విధిగా పాటించాలన్నారు. ధర్నాలు, రాస్తా రోకోలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం లాంటి నిర్వహిస్తే నేరంగా పరిగణించి చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

## జిల్లాలో 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలు

### జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

**మెదక్ అర్బన్, డిసెంబర్1 ప్రభాతవార్త:** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల (డిసెంబర్ 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అలాగే ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ హెచ్చరించారు. కాబట్టి జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు ఈ విషయంలో సహకరించాలని తెలిపారు.



గీతంలోని స్ట్రాంగ్‌రూంకు సీల్ వేస్తుతున్న కలెక్టర్, రిటర్నింగ్ అధికారి

## గీతం యూనివర్సిటికి తరలిని ఈవీఎంలు

### స్ట్రాంగ్ రూం వద్ద భారీ బందోబస్తు

**జహీరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** జిల్లాలోని పటాన్‌చెరు మండలం రుద్రారం వద్ద గల గీతం యూనివర్సిటీకి గురువారం జరిగిన శాసన సభ ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంలను భారీ బందోబస్తు మధ్య జహీరాబాద్ శాసన సభ స్థానాల్లోని పోలింగ్ కేంద్రాల నుంచి రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి, డిఎస్‌పి వి రఘుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు మధ్య తరలించారు. రుద్రారంలోని స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను ఎన్నికల అభ్యర్థుల ఏజంట్ల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్, అబ్జర్వార్ పవన్‌కుమార్, రిటర్నింగ్ అధికారి వెంకారెడ్డి, డిఎస్‌పి వి రఘుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలకు శీలు వేశారు.

## జిల్లాలో 76.99 శాతం ఓటింగ్

### అత్యధికంగా అందోల్-అత్యల్పం సంగారెడ్డి

**సంగారెడ్డి మున్సిపాలిటి, డిసెంబరు 1, ప్రభాతవార్త:** శాసన సభ ఎన్నికలకు సంబంధించి గురువారం జరిగిన పోలింగ్‌లో జిల్లా వ్యాప్తంగా ఉన్న 5 శాసన సభ స్థానాల్లో 76.99 శాతం (13లక్షల 93వేల 711 మంది ఓట్లకు గాను 10లక్షల 73వేల 14 మంది ఓటర్లు) పోలింగ్ జరిగినట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్ తెలిపారు. జిల్లాలోని 5 శాసన సభ స్థానాల్లో జరిగిన పోలింగ్‌లో అత్యధికంగా అందోల్ నియోజకవర్గంలో 2లక్షల 49వేల 248 మంది ఓట్లు ఉండగా 2లక్షల 11వేల 364 మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని జిల్లాలో అత్యధికంగా పోలింగ్ జరిగిన నియోజకవర్గంగా నిలచింది. అయితే పటాన్‌చెరు నియోజకవర్గంలో 3లక్షల 97వేల 237 మంది ఓట్లకు గాను 2లక్షల 76వేల 510 మంది ఓటర్లు (69.61 శాతం) ఓటును వినియోగించుకుని జిల్లాలో పోలింగ్ శాతంలో ఆఖరి స్థానంలో నిలిచింది. అయితే జహీరాబాద్ నియోజకవర్గంలో 2లక్షల 70వేల 785 మంది ఓటర్లు ఉండగా 2లక్షల 7వేల 748 మంది ఓట్లను (76.72 శాతం)సద్వినియోగం చేసుకోగా నారాయణఖేడ్ నియోజకవర్గంలో 2లక్షల 31వేల 188 మంది ఓటర్లు ఉండగా 1లక్షల 92వేల 418 మంది (83.23 శాతం), సంగారెడ్డి నియోజకవర్గంలో 2లక్షల 45వేల 253 ఓట్లకు గాను 1లక్ష 84వేల 975 (75.42 శాతం) మంది తమ ఓట్లను సద్వినియోగం చేసుకున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్ పేర్కొన్నారు.

## ఘనంగా మహా మృత్యుంజయ హోమం.. రుద్రాభిషేకం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

**రామాయంపేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** రియల్ వ్యాపారి, జహీరాబాద్ పట్టణానికి చెందిన స్వర్ణకార సంఘం నాయకుడు నాగభూషణచారి ఆధ్వర్యంలో పురోహితులు చౌడి రవితేజ్ బృందం సభ్యులు శుక్రవారం నాడు వివిధ పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. గత కొద్దిరోజుల నుండి రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో గల గొల్పర్తి గ్రామ శివారు వద్ద పూజా కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంగతి పాటకులకు విధితమే...అందులో భాగంగానే శుక్రవారం నాడు కుంకుమపూజ, గోవుపూజ, రుద్రాభిషేకం, గణపతి మూల మంత్రం, హోమం, మహామృత్యుంజయ సంపుటి హోమం, సుదర్శన మూల మంత్రం హోమం, లక్ష్మీ మూలమంత్ర హోమం, మన్యుసూక్త హోమం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈకార్యక్రమంలో వై.రమేష్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

## అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతి

**రామాయంపేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** మలిదశ తెలంగాణ ఉద్యమ మొట్టమొదటి అమరవీరుడు కానిస్టేబుల్ కిష్టన్న ముదిరాజ్‌గారి 14వ వర్ధంతిని రామాయంపేటలో అశ్విని శ్రీనివాస్ ముదిరాజ్ గారు ఏర్పాటు చేశారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి రామాయంపేట ముదిరాజ్ సంఘం నాయకులు హాజరై కిష్టన్న గారి ఆత్మ బలిదానం చేసుకున్న విధానమును వివరించి, తెలంగాణ అంటే కిష్టన్నకు ఎంతో ఇష్టమని, తెలంగాణలో విద్యార్థులు ఉద్యోగాలకు దూరమవ్వకూడదంటే తెలంగాణ రావాల్సి న అవసరం కచ్చితంగా ఉందని ఆనాడే కిష్టన్న గుర్తించారని అన్నారు. అలాగే వ్యవసాయం అభివృద్ధి చెందాలన్న, రాష్ట్ర అభివృద్ధి చెందాలన్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర అవసరమని ఆనాడే గుర్తించిన కిష్టన్నగారు ఆత్మబలిదానం చేసుకోవడం జరిగిందని అన్నారు. కనుక ఇలా బలిదానాలు చేసుకున్న అమరవీరులను గుర్తుచేసుకోవాల్సి న అవసరం యావత్తు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ ఉందని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రం ఆంజనేగులు, రొయ్యల పోచయ్య, రొయ్యల కిషన్, దేవుని శ్రీనివాస్, పుట్టి స్వామి తదితర ముదిరాజ్ సంఘం పెద్దమనుషులు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

# ఎన్నికలపై తగ్గిన ఆసక్తి

**జిల్లాలో మొత్తం ఓటర్లు 9,48,664**
**పోలింగ్‌కు రాని 1,60,793 మంది ఓటర్లు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** శాసనసభ సాధారణ ఎన్నికల్లో భాగంగా గురువారం నిర్వహించిన పోలింగ్‌లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు గానూ గజ్వేల్ మినహా మహిళలే ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోని 1151 బూత్‌లకు గానూ 9,48,664 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉండగా 7,87,871 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 468422 మంది ఓటర్లకు గానూ 3,92,014 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 76408 మంది ఓటింగ్ దూరంగా ఉన్నారు. మహిళలు 4,80,166 మంది ఓటర్లు ఉండగా 3,95,816 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 84,350 ఓటింగ్ మహిళలు దూరంగా ఉన్నారు. జిల్లాలో ఇతరులు 41 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా జిల్లాలో 1,60,758 మంది ఓటింగ్ దూరంగా ఉన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 233733 మంది ఓటర్లు ఉండగా అందులో 1,78,420 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 1,5346 మంది ఓటర్లు ఉండగా 88673 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు 1,18317 మంది గానూ 89710 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతరులు 70 మందికి గానూ 37 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గజ్వేల్ మొత్తం ఓటర్లు 2,74654 మందికి గానూ 2,31086 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో పురుషులు 1,36294 మందికిగానూ 1,15892 మంది, మహిళలు 1,38353 మందికి గానూ 1,15191 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 2,42177 మంది ఓటర్లు ఉండగా 2,04999 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 1,19761 మంది గానూ 1,01898 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు 1,22412 మందికి గానూ 1,03100 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. దుబ్బాక నియోజకవర్గంలో 1,98100 మంది ఓటర్లు ఉండగా 1,73366 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందులో పురుషులు 97,019 మందికి గానూ 85,551 ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు 1,01081 మందికి గానూ 87,815 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు గానూ అత్యధికంగా దుబ్బాక నియోజకవర్గం పోలింగ్ కాగా సిద్దిపేటలో తక్కువగా పోలింగ్ నమోదైంది. ఎది ఏమైన ఓటర్లు ఎవరిణి కరుణించారో వేచి చూద్దాం.




ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలిస్తున్న అధికారులు

## స్ట్రాంగ్ రూంలకు చేరిన బ్యాలెట్ యూనిట్లు

### అర్ధరాత్రి వరకు జేఎన్టీయూకు ఈవీఎంలు

**పుల్కల్, డిసెంబరు 1, ప్రభాతవార్త:** అందోల్ శాసన సభ స్థానానికి గురువారం జరిగిన పోలింగ్‌కు సంబంధించి ఈవీఎంలను గురువారం రాత్రి వరకు జెఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు తలరించారు. నియో జకవర్గంలోని 313 పోలింగ్ కేంద్రాలలో గురువారం శాసన సభ ఎన్నికలు జరిగిన విషయం పాఠకులకు విధితమే. జెఎన్టీ యూ కళాశాల నుంచి శుక్రవారం తెల్లవారు జామున ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో భారీ బందోబస్తు మధ్య పటాన్‌చెరు మండలంలోని రుద్రారంలో గల గీతం యూని వర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు అందోల్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాండు, డిఎస్‌పి బాలాజీ నాయక్‌ల పర్యవేక్షణలో తరలించారు. అభ్యర్థుల ఏజంట్ల సమక్షంలో అధికా రులు స్ట్రాంగ్ రూంలో (లెక్కింపు కేంద్రం) సామాగ్రిని భద్రపర్చి సీల్ చేశారు.

# గజ్వేల్‌లో సెంటిమెంట్ కొనసాగేనా?






**ఎగ్జిట్ పోల్స్‌తో బిఆర్‌ఎస్ గుండెల్లో గుబులు**
**గజ్వేల్‌లో చరిత్ర సృష్టించనున్న ఎన్నికల ఫలితాలు**
**అంతుపట్టని ప్రజల నాడి**
**ఈ నెల 3న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం**

**గజ్వేల్, డిసెంబర్ 1 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో అందరి చూపు గజ్వేల్ నియోజకవర్గంపైనే ఉంది. గజ్వేల్ నియోజకవర్గంలో రాష్ట్రాన్ని శాసించే హేమా హేమీలు బరిలో దిగగా బిఆర్‌ఎస్ పార్టీ నుండి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, బిజెపి నుండి ఈటల రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నుండి తూంకుంట నర్సారెడ్డిలు బరిలో దిగడంతో పోటీ తీవ్రతరమైంది. ఇదిలా ఉండగా 1957 నుండి 2018 వరకు గజ్వేల్ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలిస్తే ఆ పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చే ఆనవాయితీ ఉందని, నవంబర్ 30న జరిగిన ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు గెలిచినా లేక బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ గెలిచినా రాష్ట్రంలో ఎగ్జిట్ పోల్స్ మొత్తం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రచారం కావడంతో గజ్వేల్ నియోజకవర్గం సెంటిమెంట్ కొనసాగుతుందా లేదా అనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి గెలిచే అవకాశాలు ఉంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని, గజ్వేల్ నియోజకవర్గ ప్రజల నాడి ఎటువైపు ఉందో సర్వేలకు అంతుచిక్కడం లేదని విశ్లేషకులు చెప్తున్నారు. రాష్ట్రంలో ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ వైపు ఉండడంతో బిఆర్‌ఎస్ పార్టీ నాయకులకు గుండెల్లో గుబులు పుడుతున్నట్లు పలువురు అనుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు గజ్వేల్‌లో విజయం సాధిస్తే రాష్ట్రంలో బిఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. 2018లో సిఎం కెసిఆర్ గజ్వేల్ నుండి పోటీ చేయగా 58,290 ఓట్ల మెజార్టీతో గెలుపొందగా ప్రస్తుతం బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ ఇక్కడి నుండి పోటీ చేయడంతో ఎవరిది గెలుపు అనేది అంతుపట్టడంలేదు. ఏదిఏమైనా గజ్వేల్‌లో సెంటిమెంట్ కొనసాగితే మాత్రం మరోసారి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు విజయం సాధిస్తే మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు నియోజకవర్గ ప్రజలు అనుకుంటున్నారు.

## ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలి

### -గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

**గజ్వేల్ టౌన్, డిసెంబర్ 1 (ప్రభాతవార్త):** ప్రతి ఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని, దైవ భక్తితోనే ముక్తి లభిస్తుందని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి. రాజమౌళి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక వాసవి కన్యకాపరమేశ్వరి పారాయణంతో పాటు అమ్మవారికి లక్ష గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ చైర్మన్ రాజమౌళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని ఆర్యవైశ్యులు అందరూ కన్యకాపరమేశ్వరి పారాయణంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఆర్యవైశ్య ఆరాధ్య దైవం వాసవి కన్యకాపరమేశ్వరి పారాయణం వల్ల అంతా మంచి జరుగుతుందని అన్నారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన వారికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్, ఆర్యవైశ్య నాయకులు సిద్ది బిక్షపతి, నంగునూరి సత్యనారాయణ, తోట బిక్షపతి, అంతునూరి శివకుమార్, నాగేందర్, ప్రకాష్, మెట్రాములు, శేఖర్, కైలాస ప్రశాంత్, వెంకటేష్, సిద్ది నవీన్, అంజయ్య, కృష్ణమూర్తి, సిరిపురం సత్యనారాయణ, ప్రసాద్, మనోహర్, ఆర్యవైశ్య మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# తనిఖీలో రూ.5కోట్ల 27లక్షల 42వేలు జప్తు

**- రూ.3 కోట్ల 44లక్షల 22వేల రూపాయలు విడుదల**
**జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్**

**సంగారెడ్డి మున్సిపాలిటి, డిసెంబరు 1, ప్రభాతవార్త:** శాసన సభ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 5కోట్ల 27లక్షల 42వేలు 852రూపాయలను పోలీసులు సీజ్ చేశారని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శరత్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం...పోలీసులు జప్తు చేసిన డబ్బులకు సంబంధించి బాధితులు సరైన పత్రాలు అందచేయడంతో 3కోట్ల 44లక్షల 22వేల 338 రూపాయలను విడుదల చేశామన్నారు. జిల్లాలోని 5 శాసన సభ స్థానాల్లోని అందోల్ నియోజకవర్గంలో 12 కేసులలో 19లక్షల 80వేల 20 రూపాయలు జప్తు చేయగా 11 మంది బాధితులకు సంబంధించి 18 లక్షల 50వేల 20 రూపాయలను విడుదల చేశామన్నారు. జహీరాబాద్ నియోజకవర్గంలో 41 కేసులలో 1 కోటి 45లక్షల 23వేల 430 రూపాయలను జప్తు చేయగా 39 మందికి సంబంధించిన 97లక్షల 97వేల 430 రూపాయలను విడుదల చేశామన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 29 కేసులలో 56లక్షల 15వేల 988 రూపాయలను జప్తు చేయగా 27 మందికి సంబంధించిన 54లక్షల 65వేల 590 రూపాయలను విడుదల చేశామన్నారు.

పటాన్‌చెరు నియోజకవర్గంలో 46 కేసులలో 2 కోట్ల 19వేల 69వేల 604 రూపాయలను జప్తు చేయగా 40 కేసులకు సంబంధించి 86లక్షల 55వేల 590 రూపాయలను బాధితులకు అందించామన్నారు. 11 కేసులకు సంబంధించి సరైన ఆధారాలు సమర్పించనందున 1కోటి 83లక్షల 20వేల 514 రూపాయలను విడుదల చేయలేదన్నారు. బాధితులు సరైన ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పించి తమ నగదును తీసుకుపోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సూచించారు.

# మెదక్ జిల్లాలో ఓటెత్తిన ఉత్సాహం




కలెక్టర్ రాజర్షిషాను పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

**రాష్ట్రంలోనే అత్యధికంగా పోలింగ్ శాతం నమోదు**
**జిల్లా అధికార యంత్రాంగానికి శుభాకాంక్షలు**
**టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్**

**మెదక్ అర్బన్, డిసెంబర్1 ప్రభాతవార్త:** జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా కృషి చేసి పోలింగ్ శాతం నమోదులో మెదక్‌ను రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలిపారని టీఎన్జీవో మెదక్ జిల్లా అధ్యక్షులు దొంత నరేందర్ పేర్కొన్నారు. శుక్రవారం టీఎన్జీవో అధ్యక్షులు తన బృందంతో కలిసి జిల్లా కలెక్టర్ రాజర్షిషాకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు ఉన్న ప్రతి ఒక్కరు ఓటును సద్వినియోగం చేసుకునేలా అధికారులు ప్రజలకు వివరిస్తూ ఓట్లలో చైతన్యం తెచ్చేలా వివిధ కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాముఖ్యత, ఈవీఎం, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పించారన్నారు. బస్టాండ్లు, ప్రధాన చౌరస్తాలు, మార్కెట్ యార్డులు, విద్యాసంస్థల్లో సాంస్కృతిక కళాజాత కార్యక్రమాలు, టీఎన్జీవో ఆధ్వర్యంలో ఉద్యోగులకు అవగాహన సదస్సులు నిర్వహించడంతో పోలింగ్ శాతం పెరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మినికి రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గాండ్ల అనురాధ, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి. ఇక్బాల్ పాషా, సంయుక్త కార్యదర్శి పోతురాజు శంకర్, మెదక్ యూనిట్ కార్యదర్శి ఆరెళ్ల రామాగౌడ్ తదితరులు ఉన్నారు.

## బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే మైనంపల్లి

### ఎంఎస్ఎస్ఓ ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతురావు

**రామాయంపేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** శాసనసభ ఎన్నికల సందర్భంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఇంటి నుండి బయలుదేరిన భార్యాభర్తలకు రోడ్డు ప్రమాదం జరిగి భార్య మరణించడంతో విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతురావు శుక్రవారం నాడు ఆకుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. వివరాల్లోకి వెళ్తే నిజాంపేట మండల చల్మెడ గ్రామానికి చెందిన గణేష్ అతని భార్య ఇద్దరు గురువారం నాడు మేడ్చల్ నుండి ద్విచక్ర వాహనంపై ఓటు హక్కు వినియోగించుకోవడానికి వస్తుండగా మార్గమధనయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గణేష్ భార్య లావణ్య(30) చనిపోవడం జరిగింది. అయితే విషయం తెలుసుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతురావు మృతురాలి తల్లిగారు గ్రామమైన దామరచెరువుకు వెళ్లి ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వారికి ధైర్యం చెప్పారు. అన్ని విధాలుగా కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎంఎస్ఎస్ఓ ద్వారా లక్ష రూపాయల చెక్కును ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకుడు చౌదరి సుప్రభాత్‌రావు చేతుల మీదుగా ఇప్పించారు. ఆయన వెంట పార్టీ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, వెంకుగారి శ్రీధర్‌రెడ్డి, ఎనిశెట్టి అశోక్, పిట్ల ప్రకాష్, కుమార్ సాగర్, కోనాపూర్ సాగర్, యుగేందర్‌రావు, దోమకొండ యాదగిరి, సుంకోజు దామోదర్, ఎనిశెట్టి సంతోష్ తదితరులు ఉన్నారు.

# అందోలు హస్తగతమేనా?

**గెలుపు ధీమాలో కాంగ్రెస్ శ్రేణులు**
**సైలెంట్ ఓటింగ్‌పైనే గులాబీదళం ఆశలు**
**పోలింగ్ కేంద్రాల వారీగా బేరీజు వేసుకుంటున్న నేతలు**

**జోగిపేట, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పటినుంచి మొదలుకొని ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావం అనంతరం కూడా అందోలు నియోజకవర్గానికి రాష్ట్రంలోనే ప్రత్యేకస్థానం ఉంది. ఇక్కడి గెలుపొందిన పార్టీయే రాష్ట్రంలో అధికారం చేపట్టడం జరుగుతూ వస్తుంది. ఈ సందర్భంలో అందోలులో ఎవరు గెలుపొందుతారనే విషయమై జోరుగా చర్చ సాగుతంది. గురువారంనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ముగియటంలో బరిలో ఉన్న అభ్యర్థులు గెలుపుఓటములపై బేరీజు వేసుకుంటున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఐదుశాతం వరకు పోలింగ్ తగ్గింది. గత ఎన్నికల సమయంలో స్థానిక నినాదం ప్రభావం ఎక్కువగా ఉండటంతో టిఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపొందారు. బిజెపి నుంచి ఓ వ్యక్తి బరిలో ఉన్నప్పటికీ కేడర్ లేకపోవటంతో అందోలులో బిజెపి ప్రభావం ఏమంతలేదు. దీంతో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ మధ్యనే ప్రధాన పోరు నెలకొంది.

### గతానికి భిన్నంగా వ్యూహం

ఈసారి ఎన్నికల్లో మాజీ ఉప ముఖ్యమంత్రి పక్కా వ్యూహంతో వ్యవహరించారు. ఎక్కడా ఏ కార్యక్రమం నిర్వహించినాకూడా పకడ్బందీగా నిర్వ హించినా ఆ కార్యక్రమాలు విజయవంతం కావటంతోపాటు కార్యకర్తల్లో ఫుల్ జోష్ పెంచేవిధంగా చూసుకున్నారు. అంతేకాకుండా పార్టీలో చేరికల విషయంలోకూడా ఆచితూచి వ్యవహరించారు. బిఆర్‌ఎస్ నుంచి పార్టీలోకి చేరేందుకు చాలామంది నాయకులు సంసిద్ధత వ్యక్తం చేసినప్పటికీ కూడా పార్టీకి పక్కాగా ఉపయోగపడతారు, లాభం చేకూరు తుందనే వారిని మాత్రమే చేర్చుకున్నారు. ఒకవేళ ఎవరైనా నాయకుడిని చేర్చుకుంటేతమ పార్టీ నాయకులకు ఇబ్బంది కలుగుతుంది, పార్టీలో ఉన్నవారు పనిచేయకుండా ఉండే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్న సందర్భంలో, అలాంటి వారిని పార్టీలోకి చేరతామని సంప్రదింపులు చేసినాకూడా పార్టీలో చేర్చుకోలేదు. గతంలో ఇలాంటి పొరపాటు చేయ టంతోనే పార్టీలోని సీనియర్లు నాయకులు సరిగా పనిచేయ కపోవటంతోనే ఆయన ఓటమిపాలు కావాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో అందుకు భిన్నంగా ఈ సారి వ్యవహరించారు. నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట మున్సిపాలిటీకి చెందిన టిఆర్‌ఎస్ కౌన్సిలర్లు కొంతమందిని పార్టీలో చేర్చుకోగా మరో నలుగురు చేరడానికి సుముఖంగా ఉన్నప్పటికీ వారిని చేర్చుకోలేదు. అంతేకాకుండా మరికొంతమంద సీనియర్ నాయకులు కూడా కాంగ్రెస్‌లో చేరడానికి ప్రయత్నించినా వారిని పార్టీలోకి ఆహ్వానించలేదు. ఇలా పార్టీలో నాయకులను చేర్చుకునే విషయం మొదలుకొని, నామినేషన్ల కార్యక్రమం నుంచ చివరికి రాహుల్‌గాంధీ సభ వరకు అన్ని కార్యక్రమాలు పక్కాగా నిర్వహించారు. దీంతో నియోజకవర్గ ప్రజల తీర్పు తమకే అనుకూలంగా ఉంటుందనే ధీమాలో కాంగ్రెస్ శ్రేణులు ఉన్నారు. ఊహించినదానికన్నా ఎక్కువ మెజార్టీ వచ్చే అవకాశాలున్నాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు.

### సైలెంట్ ఓటింగ్‌పైనే టిఆర్‌ఎస్ ఆశలు

నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యక్రమాలు సభలు, సమావేశాలకు ధీటుగా బిఆర్‌ఎస్ వారు సభలు, సమావేశాలు నిర్వహించినా కూడా అనుకున్నస్థాయిలో అవి విజయవంతం కాలేవు. బిఆర్‌ఎస్ వారు కులాలవారీగా సమావేశాలు నిర్వహించారు. యువత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇవన్నీ అంతంతమాత్రగానే జరటంతో ముఖ్యమంత్రి కేసిఆర్ సభపైనే వారు పూర్తి నమ్మకం పెట్టుకుని భారీ స్థాయిలో జన సమీకరణ చేశారు. అయితే ఈ సభ సక్సెస్ కావటం, బిఆర్‌ఎస్ అమలు చేస్తున్న పలు అభి వృద్ధిసంక్షేమ పథకాలపైనే బిఆర్‌ఎస్ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ నాయకులది కేవలం మేకపోతు గాంభీర్యమేనని, గతంలోకూడా ఇలానే హంగామా చేశార ని, చివరికి తామే గెలుపొందామని, ఈ సారి కూడా అదే తంతు రిపీట్ అవుతుందని, మంచి మెజార్టీతో బిఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపొందటం ఖాయమని బిఆర్‌ఎస్ శ్రేణులు పేర్కొంటున్నారు. మొత్తానికి గెలుపుపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**యాచారం డిసెంబరు1,ప్రభాతవార్త :** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరంగా మారిందని పలువురు పేర్కొన్నారు.శుక్రవారం యాచారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామానికి చెందిన మదేల నరసింహ్మకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సహకారంతో మంజూరైన 18వేల రూపాయల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లేష్ ,పోలేవుని పాండు,సినియర్ నాయకులు పరికిసాన్ రెడ్డి,దార అంజయ్య,పిఎస్ఎస్ బ్యాంకు డైరెక్టర్ మదేల శశికళ,తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లి మండలంలో 86శాతం పోలింగ్

**తలకొండపల్లి డిసెంబరు1,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మండలంలో మొత్తం 86శాతం మేరకు పోలింగ్ జరిగినట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్, ఎంపిడివో శ్రీకాంత్ తెలిపారు.తలకొండపల్లి మండలంలో మొత్తం 39 పోలింగ్ స్టేషన్లో 36వేల 768 ఓట్లు ఉన్నట్లు ఆయన తెలిపారు.మండలంలోని గ్రామాల వారీగా అత్యధికంగా దేవునిపడకల్ పోలింగ్ బూత్‌లో 1086 ఓట్ల గాను 1004ఓట్లతో 92.4శాతం రెండో స్థానంలో మొదక్‌పల్లి పోలింగ్ బూత్‌లో 907ఓట్లకు గాను 826 ఓట్లతో 91.8 శాతం ఓట్లతో రెండో స్థానంలో పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. మండలంలో మొత్తం 39 బూతులలో 36వేల 768 ఓట్ల గాను 31వేల 628 ఓట్ల చొప్పున 86.0శాతం పొలైనట్లు వారు తెలిపారు.

## నేడు పూడూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం

**పూడూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** ఈనెల 2వతేదీన (నేడు)పూడూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ సూపరింటెండెంట్ వరలక్ష్మీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 11గంటలకు ఎంపిపి మల్లేశం అధ్యక్షతన మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల ఎంపిటిసిలు,సర్పంచులు సకాలంలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## హెచ్ఐవీ పట్ల జాగ్రత్తలు వహించాలి

**- షాద్‌నగర్‌లో ఎయిడ్స్ అవగాహన ర్యాలీ**



ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తు ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**షాద్‌నగర్ డిసెంబర్ 1, ప్రభాతవార్త :** డిసెంబర్ 1 ఎయిడ్స్ డేను పురస్కరించుకొని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో షాద్‌నగర్ డీప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మీ ఆదేశానుసారం పట్టణ ముఖ్యకూడలీలో శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు డాక్టర్లు మాట్లాడుతూ... ఎయిడ్స్‌పై పూర్తి అవగాహన కల్పించారు. హెచ్ఐవీ వ్యాపించే విధానాలు, వాటిని అరికట్టే పద్ధతులను వివరించి ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ డాక్టర్ శ్రీనివాసులు, ఆప్తల్మిక్ ఆఫీసర్ శ్రీహరి, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, ఐసీటీ సెంటర్ శ్యాంసుందర్, ఆశోక్, వైద్య సిబ్బంది మాధవి,ఝాన్సీ, శ్రీలత, శ్రీశైలం, ఆన్వర్, శ్రీధర్‌రెడ్డి, రవి, వేమారెడ్డి పాల్గొన్నారు.

## చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ గెలుపు ఖాయం

**శంకర్‌పల్లి, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి భీమ్ భరత్ గెలుపు ఖాయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భానూరి కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య కుటుంబ పాలన అంతం చేసేందుకు నియోజకవర్గం ప్రజలు ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని అన్నారు. నియోజకవర్గం ప్రజలు అభివృద్ధిని కోరుకున్నారు కాబట్టి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తున్నారని పేర్కొన్నారు. కాగా రాష్ట్రంలో కూడా అధిక మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు.

## ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

**షాబాద్, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమిష్టిగా పనిచేసినందుకు అందరికి అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో టీపీసీసీ కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డిలతో కలిసి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మీకన్న బిడ్డలా చేరదీసినందుకు ప్రతి ఒక్కరికి చేతులెత్తి మొక్కుతున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించి అమానించి రేయింబవళ్లు కష్టపడి పనిచేసినందుకు ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. ఎన్నికల్లో తనతో పాటే సైనికుల్లా సేవలందించిన కార్యకర్తలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గాలివీస్తుందని, సర్వేలు కూడా కాంగ్రెస్ పార్టీకి శుభసూచికం చూపిస్తున్నాయన్నారు. పార్టీ నాయకులతో పాటు అన్ని విభాగాల కార్యకర్తలకు, ఎన్నికల్లో బాగా పనిచేసిన వారందరికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్తకు ఏ అవసరం వచ్చిన అండగా ఉంటానని భరోసా నిచ్చారు.ఈకార్యక్రమంలో ఎంపీటీసీ మల్లేష్, నాయకులు రాఘవరెడ్డి, తమ్మలి రవీందర్, అక్తర్‌పాష, గడ్డం చంద్రయ్య,పీసరి వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్, పెంటారెడ్డి, పామెన నర్సింలు, చెన్నయ్య, రమేష్, రాజు, గౌతం, మాజీ సర్పంచులు యాదగిరి, బుచ్చయ్య ,సత్యానారాయణ, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పామెన భీంభరత్

# కబ్జాలకు గురవుతున్న నదీ నాలాలు

**-కుచించుకుపోతున్న వాగు,వంకలు ప్రశ్నార్ధకంగా మారుతున్న భవిష్యత్తు**

**కందుకూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త:** రియల్‌ల్టర్‌లు వ్యాపార దృక్పథంతో చేపడుతున్న నిర్మాణాలు భవిష్యత్తును ప్రమాదాలోకి నెట్టబడుతున్నాయి. రాష్ట్ర రాజదానికి కూతవేటు దూరంలో ఉన్న కందుకూరు మండలం దినదినాభి వృద్ధి సాదిస్తుండగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు దృష్టి సారించారు. ఈ ప్రాంతంలో భూమలు దరలు ఎక్కువగా ఉండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు తక్కువ దరలకు వచ్చే భూములపై దృష్టి సారిస్తున్నారు. వారు సేకరించే భూములు గృహనిర్మానాలు చేయడానికి అనువుగా ఉన్నాయా వెంచర్‌లు చేయవచ్చా అనే అలోచన చేయడం లేదు. వ్యాపారమే పరమావదిగా భావించే వ్యాపారులు నదీ నాలాలైనా వంపు ప్రాంతమైనా వంద్రు నేలలైనా మనకెందుకు వెంచర్ చేశామా రంగు రంగు బ్రోచర్‌లతో వినియోగదారులను అకర్షింప జేశామా అంటే పైపైన వెంచర్ నిర్మాణం పనులను చేస్తు వినియోగదారులను అకర్షిస్తు రంగుల మాయతో వినియోగదారులను బోల్తా కొట్టిస్తున్నారు. మండల పరిదలో కొత్తూరు, గూడూరు, కందుకూరు రెవెన్యూ గ్రామాల పరిదిలోకి వచ్చే ప్రాంతాలలో నదీనాలాల పక్కన, వంపు ప్రాంతాలలో వెలసిన, వెలస్తున్న వెంచర్‌లు నీటి ప్రవాహలకు ఎలా నిలుస్తాయనేది ప్రశ్నార్థకంగా మారింది. సుదూర ప్రాంతాలలో ఉండే వినియోగదారులు ఈ వాస్తవికతను గుర్తించక మొసపోతున్నారు. గూడూరు గ్రామానికి వెళ్లే దారిలో వెలసిన ఒక వెంచర్ వంపు ప్రాంతంలో ఏర్పాటు చేయడం జరిగింది. వర్షాలు పడితే వరద ప్రవహించే



వరద ప్రవాహం ఎక్కువగా ఉండే వంపు ప్రాంతంలో వెలసిన వెంచర్

మార్గానికి అడ్డుగా వెంచర్ నిర్మానం చేసి వెంచర్‌చుట్టు ప్రహరీ గోడను నిర్మించడం జరిగింది. ఇటీవలి కాలంలో అ మార్గం గుండా ప్రవహించిన వరదనీరు హైద్రాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని గంటల తరబడి స్తంబింప చేసింది. అలాగే దానికి సమీపంలో కొత్తూరు వాగుపక్కన భూమిని కొనుగోలు చేసిన వారు అభివృద్ధి పనులలో బాగంగా ప్రహరీ గోడ నిర్మానం చేపట్టి వారి పొలం పక్కనుండి వెలుతున్న కొత్తూరు వాగుఅంచులను పూడుస్తు వాగు వెడల్పును తగ్గిస్తు ప్రహరీ గోడనిర్మానాన్ని చేపట్టడం జరుగుతుంది. ఈ వాగు సుదూర ప్రాంతం నుండి ప్రవహిస్తు వస్తుంది. వర్షాలు కురిస్తే అయా చెర్వులు కుంటలనుండి పెద్దమొత్తంలో నీరు ప్రవహిస్తు ఈవాగుగుండా వెళ్లి ఇబ్రాహింపట్నం చెర్వులోకి నీరు చేరుతుంది. ఇలా నదీ పారివాహక ప్రాంతాలను వంపుప్రాంతాలను అక్రమనలకు గురిచేస్తు భవిష్యత్తును ప్రశ్నార్ధకంగా మారుస్తున్నారు. వాగులు వంకలు కుచించుకుపోతే వరదనీరు ఎక్కువైతే అమార్గంగుండా వెళ్లే వరదనీరు పంటపొలాలను ముంచెత్తే పరిస్తితులు నెలకొన్నాయి, ప్రమాదాలు విపత్తులు జరుగనప్పుడు అంతా బాగుంటుంది. ఏదైనా జరుగరానిది జరిగితే భాద్యత ఎవ్వరు తీసుకుంటారనేది ప్రశ్నగా మితులుతుంది. రాష్ట్ర రాజదాని హైద్రాబాద్‌లో అనాడు ఇలాంటి అక్రమ పద్దతులకు తెరలేపడంవలన రియల్టర్‌లు వంపు ప్రాంతాలను, నదీనాలాలను అక్రమించి ప్లాట్లుచేసి అభంశుభం తెలియని అమాయకులకు కట్టబెట్టి చేతులు దులుపుకున్నారు. అనాడు కోటిఅశలతో ప్లాట్లు కొన్న వారు ఇండ్లు నిర్మించుకుని సాఫీగా ఉందనుకునే సమయంలో విపత్తులు సంబవించగానే నేడు పడరాని పాట్లు పడుతున్నారు. పలు సందర్భాలలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలంవెల్లదీసే పరిస్తితులు చూస్తున్నాము. ?ఇలాంటి పరిస్థితుల నుండి ప్రజలను కాపాడవలసి అధికార యంత్రాంగం వాస్తవ పరిస్తితులను గుర్తించకుండా రియల్టర్ల ప్రయోజనాలకు పెద్దపీటవేస్తున్నారు. నిబందనలు తుంగలో తొక్కుతు అంతా బాగుందన్న చందంగా వెంచర్లు చేయడానికి ప్లాట్లు వేయడానికి అనులమతులు ఇవ్వడం జరుగుతుంది. దానితో అమాయ ప్రజలు అనుమతులు అన్ని ఉన్నాయన్న అలోచనతో ప్లాట్లు కొని మోసపోతున్నారు. ఈ విషయంలో పాలకులు అలోచించాలని అక్రమాలకు పాల్పడుతున్న వారిపైన ఖటినచర్యలు తీసుకోవాలని అమాయకులు మొసపోకుండా చర్యలు చేపట్టాలని భవిష్యత్తులో ఎలాంటి ఉపద్రవాలు సంభవిచకుండా చర్యలుతీసుకోవాలని రియల్టర్‌లకు వత్తాసు పలుకుతు వాస్తవాలను చూడకుండా అనుమతులు ఇచ్చేవారిపైన చర్యలు తీసుకోవాలని అమాయక ప్రజలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



కొత్తూరు వాగు వెడల్పు తగ్గేలా మట్టి నింపుతు ప్రహరీ నిర్మిస్తున్న దృశ్యం

# రొంపల్లిలో యువతదే పై'చేయి'

**-ర్యాలీగా వాళ్లి ఓటింగ్‌లో పాల్గొన్న వందమంది యువకులు**

**-మరికొన్ని గ్రామాల్లో పోటాపోటిగా**

**బంట్వారం,డిసెంబర్ 1 (ప్రభాతవార్త) :** మండలంలో గురువారం జరిగిన పోలింగ్‌లో ఆసక్తికర విషయాలు వెలుగు చూస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్నా ఎక్సిట్ పోల్స్ నిజమనిపిస్తుంది. మండల పరిధిలోని రొంపల్లి గ్రామంలో సుమారు వంద మంది యువకులు నినాదలిస్తు ర్యాలీగా వెళ్ళి ఓటింగ్‌లో పాల్గోనడం ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. దీన్ని బట్టిచూస్తే అధికార పార్టీని కంగారు పెట్టెలా, కాంగ్రెస్ పార్టీకి జోష్ నింపేలా ఉందని చర్చలు కొనసాగుతున్నాయి. రొంపల్లిలో కాంగ్రెస్ పై చేయి సాదిస్తుందని యువత తమ లభిప్రాయాన్ని వ్యక్తం వెలిబుచ్చుతున్నారు. ఇదే పరిస్థితి అన్ని మండలాల్లో ఇలాగే ఉంటె వికారాబాద్‌లో కాంగ్రెస్ విజయఢంఖ మోగిస్తుందని కాంగ్రెస్ శ్రేణులు ధీమాగా సంభురాలకు సిద్దమవుతున్నారు. బంట్వారం మండల వ్యాప్తంగా పోలింగ్ సరళిని, పలువురు పార్టీల నాయకులు, ఓటర్ల లభిప్రాయలను శుక్రవారం క్రోడికరించి పరిశీలించగా, అధికార బీఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్‌ల మద్య మాత్రమే పోటి ఉంది. అయితె మద్యం, డబ్బులు అనుకున్నంతగా పనిచేయలేదని తెలుస్తుంది. అనేక గ్రామాల్లో పోటాపోటిగా పోరు ఉండగా, రోంపల్లి గ్రామంలో రాలీగా వెళ్ళిన యువకులు కాంగ్రెస్ నినాదాలు చేస్తు పోనింగ్ బూత్‌లోకి చేరుకున్నారు. ఓటువేసిన అనంతరం బయటికి వచ్చి చేతి గుర్తును, విక్టరీ సింబల్ చూపడం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సహాన్ని నింపింది. ఇదే స్థాయిలో మాలసోమారంలో సైతం ఓటు వేశాక వచ్చినవారంత కాంగ్రేస్‌కు జిందాబాద్‌లు



ఓటు వేశాక బయటికి వచ్చి గుర్తును చూపుతున్నా యువత

కొట్టడం, చేయి ఎత్తి గుర్తును చూపడం, మరికొంత మంది ఓటర్లు 'ఇక్కడ కారు నడవదు, చేయి పని చేస్తది' అంటు బహటంగానే చెప్పడంతోనే పలితం తేలిపోయిందని ఊరంత చెపుతున్నారు. ఇలా మరికొన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. ఇది ఇలా ఉంటే బంట్వారం, బొపునారం, గ్రామాల్లో మాత్రం అధికార పార్టీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు తమదంటె, తమదే మేజారిటీ అంటు ధీమా వ్యక్తం చేస్తూన్నారు. రొంపల్లి, మాలసోమారం, తొరుమామిడి గ్రామాల్లో ఏ పార్టీకి మెజార్టీ వస్తే ఆ పార్టీకి మండలంలో మెజార్టీ ఉంటుందని, విజయావకాశాలు మెండుగా ఉంటాయని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైన 3వ తారీఖు పలితాలు ఎవరిని ఎలా చేస్తుందో వేచిచూడాల్సిందే..

# ఎమ్మెల్యే పీఏ ఓవర్ యాక్షన్. !

**- పోలింగ్ కేంద్రాల వద్ద హాల్ చల్..**

**- చితక బాదిన స్థానిక ప్రతిపక్ష నాయకులు**

**తాండూరు, డిసెంబరు 1, ప్రభాతవార్త :** ఎక్కడైనా ఓ ప్రజాప్రతినిధి వ్యక్తి గత సిబ్బంది ఆ ప్రజా ప్రతినిధి చెప్పిన పనులను పూర్తి చేస్తూ.. ప్రజాప్రతినిధి వద్దకు వచ్చే వారికి అనుకూలంగా, సహాయకుడిగా పనిచేస్తుంటాడు.. కానీ వికారాబాద్ జిల్లా తాండూరులో స్థానిక ప్రజాప్రతినిధికి వ్యక్తిగత సిబ్బందిలో ఒకరిగా పనిచేస్తున్న ఆయన ఆ ప్రజా ప్రతినిధి కంటే తానే ఎక్కువ అన్నట్లుగా ఓవర్‌యాక్షన్‌గా పనిచేస్తుంటారని ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు, నాయకుల్లో ఆయన ఆ ప్రజా ప్రతినిధికి పీఏ కంటే ఎక్కువ అన్నట్లు వ్యవహారిస్తుంటాడు. తాండూరులో స్థానిక ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వద్ద పీఏగా శ్రావణ్ అనే వ్యక్తి పనిచేస్తుంటాడు. అయితే, ఆయన ఎమ్మెల్యే కంటే తన మాటే ఎక్కువ అన్నట్లుగా ఆ పార్టీ నాయకులతో, కార్యకర్తలతో దురుసుగానే ప్రవర్థిస్తారని ఆరోపణలు ఉన్నాయి. గురువారం స్థానిక అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎమ్మెల్యే కంటే ఎక్కువ ఆయన పీఏ శ్రావణ్ ఎక్కువ ఓవర్ యాక్షన్ చేసినట్లు తెలిసింది. దీంతో పట్టణంలోని సాయిపూర్‌లో పోలింగ్ కేంద్రం వద్ద శ్రావణ్ చేసిన ఓవర్ యాక్షన్‌ను బరించలేని ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆయనను చితకబాది దుమ్ము దులిపినట్లు తెలిసింది. శ్రావణ్‌ను చితకబాదిన వీడియోలు.. ఆయన చేసిన హాల్



పోలింగ్ కేంద్రం వద్ద హాల్ చల్ చేస్తున్న ఎమ్మెల్యే పీఏ.

చల్ వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో ఆయన చేసిన ఓవర్ యాక్షన్‌కు ప్రజలే బుద్ధి చెప్పారని.. ఇటాంటి ఓవర్ యాక్షన్ తాండూరులో పనికిరాదని పలువురు చర్చించుకుంటున్నారు.

## ఓటరు దేవుళ్లకు కృతజ్ఞతలు

**-షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్**

**నందిగామ డిసెంబర్1,ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల్లో తనను అదరించి, ఆశీర్వదించి,ఎన్నో వ్యయప్రయాసాల కోర్చి చేతి గుర్తుకు ఓటు వేసిన షాద్‌నగర్ నియోజకవర్గం ప్రజలందరికి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్ శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలిపారు.మీ ఓటుతో నన్ను గెలుపిస్తున్నారనే గెలుపు సంకేతా లు వినిపిస్తున్నాయని,మీ ఆదరాభిమానాలను ప్రేమ,అప్యాయత,అనురాగాలను నేన్నెడు మార్చిపోనని వీర్లపల్లి నియోజకవర్గ ప్రజలందరికి శిరస్సు వంచి పాదాభి వందనం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## అన్నదాన ప్రభువుకు సన్మానం



అన్నదాన ప్రభువు శ్రీను నాయక్‌ను సన్మానించిన ఆలయ కమిటీ నిర్వహకులు

**నందిగామ డిసెంబర్1,ప్రభాతవార్త :** నందిగామ మండలం శివారులో ఉన్న పరమ పవిత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో చాకలిధనిగుట్ట గ్రామపంచాయతీ వార్డు సభ్యులు జెట్టావత్ శ్రీను నాయక్ శుక్రవారం అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా అన్నదాన ప్రభువు శ్రీను నాయక్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు హారీజీవన్,బి.సుదర్శన్ గౌడ్, బి.జంగయ్య గౌడ్,జెట్టావత్ లక్ష్మణ్ నాయక్,తదితరులు ఉన్నారు.

## మాడ్గులలో 82.31 శాతం పోలింగ్ నమోదు

**మాడ్గుల,డిసెంబర్01,ప్రభాతవార్త:-** కల్వకుర్తి నియోజకవర్గంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మాడ్గుల మండలంలోని 50పోలింగ్ బూత్‌లలో 82.31శాతం ఓటింగ్ జరిగినట్లు తహశీల్దార్ నిరంజన్ రావు ఒక్క ప్రకటణలో తెలిపారు. మండలంలోని 43879 మంది ఓటర్లు ఉండగా 36116 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.దీంతో మాడ్గుల మాడ్గుల మండలంలో 82.31 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అయన తెలిపారు.ఈనెల 3న ఇబ్రహీం పట్నంలోని సివిఆర్ కాలేజీలో కౌంటింగ్‌కు ఎన్నికల అధికారులు పూర్తి ఏర్పటు చేస్తున్న తెలిపారు.దీంతో రేపు అభ్యర్థుల భవిష్యత్తు బయటపడనుంది.

## అందరినోట...వీర్లపల్లి గెలుపు మాట

**-సంబరాల్లో మునిగితేలుతున్న కాంగ్రెస్ శ్రేణులు**

**-విందు,వినోదాలతో సంబరాలు**

**నందిగామ డిసెంబర్1,ప్రభాతవార్త :** నందిగామ మండలంలో నువ్వా..? నేనా? రీతిలో ఉత్కంఠ భరితంగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్ గెలుపు ఖాయమైందని కాబోయే మన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అని కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు,అభిమానులు ఆనంద సంబరాల్లో మునిగి తెలారు.ఈ నెల మూడవ తేదిన జరిగే ఎన్నికల కౌంటింగ్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి సుమారు పదిహేను వేలపైగా మోజార్టీతో గెలవబోతున్నారని దీమా వ్యక్తం చేస్తున్నారు.మండలంలో ఏ గల్లి చూసిన,ఏ కాలనీలో విన్న ఏ ఊరిలో ,ఏ తండాలో,బస్‌స్టాప్‌లో రైల్వే స్టేషన్‌లో ఇదే మాట జననేత వీర్లపల్లి గెలుపుతో షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల కు మంచి రోజులు రానున్నాయని శంకర్ గెలుపు ఖాయమనే దీమాతో మండలంలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు ,సంబరాలు జరుపుకుంటున్నారు.

## కడ్మూరు శివాలయంలో వైభవంగా సామూహిక యజ్ఞాలు



కడ్మూరు శివాలయంలో సామూహిక యజ్ఞాలు జరుగుతున్న దృశ్యం

**పూడూరు, డిసెంబర్ 1, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని కడ్మూరు గ్రామ శివాలయంలో శుక్రవారం సామూహిక యజ్ఞాలతోపాటు పలు కార్యక్రమాలు వైభవంగా జరిగాయి.మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో భాగంగా రెండవరోజు వేధపండితులు శివానందం,శివ,సంపత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్,రాజుల అద్వర్యంలో యజ్ఞాలు నిర్వహించారు.మధ్యాహ్నం సమయంలో కడ్మూరు,మిట్టకంకల్ గ్రామాల భజన మండలీలు పాల్గొని రాకంచెర్ల శ్రీ వెంకటదాసుల వారి సంకీర్తనలు ఆలాపించారు.రాత్రి సమయంలో ఆలయంలో మహిళా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలంకరణ కార్యక్రమాన్ని చేపట్టారు.ప్రధానోపాధ్యాయుడు చిన్నికృష్ణ అద్వర్యంలో కడ్మూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులచే కోలాటం నృత్యాలు నిర్వహించారు.దీంతో గ్రామం అంతా శివనామ స్మరణతో మార్మోగింది. వేపచెట్టు యువజన సంఘం అద్వరయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయ పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.శనివారం ఉదయం 6 గంటలకు కుంభాభిషేకం,10-30 గంటలకు శివపార్వతుల కళ్యాణం, సాయంత్రం 6గంటలకు స్వామివారి రథోత్సవం ఊరేగింపు,రాత్రి వివిధ గ్రామాలచే భజన కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.



పూడూరు మండలం కడ్మూరు శివాలయంలో కోలాటం వేస్తున్న విద్యార్థులు

## కొడంగల్‌లో 81.96 శాతం పోలింగ్

**కొడంగల్,డిసెంబర్ 1ప్రభాతవార్త :** కొడంగల్ అసెంబ్లీ-72 స్దానానికి గురువారం జరిగిన ఎన్నికల్లో 81.96 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి వరకు కొనసాగింది.రాత్రి వరకు కొనసాగిన పోలింగ్‌లో 81.96శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారి లింగ్యానాయక్ తెలిపారు.కొడంగల్ నియోజకవర్గంలో 275 పోలింగ్ కేంద్రాలకు గాను మొత్తం 2,36,625 మంది ఓటర్లు ఉండగా అందులో 1,17,303 పురుషులు,1,19,310 మంది మహిళా ఓటర్లతో పాటు ఇతరులు 12 మంది ఉన్నారు.అందులో 96,403 మంది పురుషులు,97537 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం రాత్రి సమయంలో పోలింగ్ ఏజెంట్లత సమక్షంలో సీల్ చేసిన ఈవీఎంలను భారీ పోలీసు భద్రతల మద్య స్ట్రాంగ్‌రూంకు తరలించారు.

# కొడంగల్‌లో గెలుపుపై ఎవరి ధీమా వారిదే !

**కొడంగల్,డిసెంబర్ 1ప్రభాతవార్త** అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా రాష్ట్రంలోనే అందరి దృష్టిని ఆకర్శించిన కొడంగల్ నియోజకవర్గంలో గెలుపుపై ఎవరిధీమా వారిదే అనే తీరులో ఆసక్తిని రేకెత్తిసుంది.ఇక్కడ గెలుపుపై ఇటు బీఆర్ఎస్ అటు కాంగ్రెస్ పార్టీలు ప్రతిష్టాత్మక ంగా తీసుకోవడంతో ఇరు పార్టీలు సర్వశక్తులు ఒడ్డి పోటాపోటీగా ప్రచారాలతో హోరెత్తించారు.అంతేగాక ఇరు పార్టీల అధినేతలు కొడంగల్ స్దానంపై ప్రత్యేక దృష్టిని సారించడంతో పాటు రాష్ట్ర,జాతీయ అదినేతలు సైతం తమ అభ్యర్ధులకు మద్దతుగా ప్రచారాలు చేపట్టి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.అనంతరం ఎన్నికల గడువు సమీపిస్తున్న కొద్ది నియోజకవర్గంలో కోట్లాది నగదుతో పాటు మద్యం ఏరులై పారించారు.గురువారం ఎన్నికల ఓటింగ్ ముగియడంతో పాటు అభ్యర్ధుల భవితవ్యం ఈవీఎం మిషన్‌లలో నిర్లిప్తం కావడంతో అభ్యర్దులు ఓటింగ్ సరళిపై దృష్టి సారించారు. మండలాల వారిగా పోలైన ఓటింగ్ సరిళి విధానంపై నాయకులను అడిగి తెలుసుకుంటు లెక్కలు వేసుకుంటాన్నారు.ఫలానా మండలంలో ఓట్ల సరిళి తమ పార్టీకే అనుకూలంగా ఉందంటే కాదు తమకే అనుకూలంగా ఉంటుందంటూ ఆయా పార్టీల ద్వితీయ శ్రేణీ నాయకులు లెక్కలేసుకునే పనిలో నిమగ్నమైయ్యారు.8 మండలాలకు సంబందించిన ఓటింగ్ విధాన సరళిని నిశితంగా గమనిస్తు తమదే విజయం ఖాయమని ఓ పార్టీ నాయకులు చెబుతుంటే కాదు పక్కాగా తమదే విజయమని మరో పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.నియోజకవర్గంలో ఏ నోటా విన్నా అభ్యర్ధుల గెలుపు ఓటములపైనే చర్చోప చర్చలు కొనసాగుతున్నాయి.వీటితో పాటు ఈ సారి ఎన్నికల్లో వలస ఓటర్లు అత్యధికంగా పాల్గొనడంతో తమకే అనుకూలమంటూ అధికార పార్టీ నాయకులు అంటుంటే కాదు తమకే అనుకూలంగా ఓటు వేశారని ప్రతిపక్ష పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.వీటితో పాటు ఈ సారి నూతనంగా ఓటుహక్కు నమోదు చేసుకున్న యువత తమ వైపే మొగ్గుచూపారంటూ ఓ పార్టీ నాయకులు పేర్కొంటుండగా కాదు యువత మద్దతు మాకే ఉన్నట్లు స్పష్టం అవుతున్నదని మరో పార్టీ నాయకులు పేర్కొంటుండడం విశేషం.

మరోపక్క గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి డబ్బుల ప్రభావం అధికంగా ఉండడంతో ఒక్కో ఓటుకు 2 వేల నుంచి 5 వేల వరకు ఇచ్చేందుకు కూడ అభ్యర్దులు వెనుకాడలేదని స్పష్టంగా తెలుస్తుంది.

కేవలం వలస ఓటర్ల కోసమే ఓ పార్టీ అభ్యర్ది సుమారు కోటి రూపాయల దాకా ఖర్చు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

ఏదిఏమైనా గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఎన్నికల్లో గెలుపుకోసం కోట్లలో ఖర్చుచేసిన అభ్యర్దుల భవితవ్యం తేలాలంటే మరో రెండు రోజులు వేచి చూడాల్సిందే మరి.